# సంస్కారం

'ఒరే బాబు! ఒరే'

అని ఇల్లదిరిపొయ్యేట్టు అరుస్తోంది సరస్వతి, ఆరేళ్ల కొడుకును పిలుస్తో. మల్లికార్జునరావు ఈజీచైర్లో పడుకుని చదువుకుంటున్న వాడల్లా విసుగ్గా ' ఎందుకే అట్లా అరుస్తావు?' అని కసురుకున్నాడు. సరస్వతి, వంటింట్లోంచి చెంగు నడుముకు బిగించుకుంటో, బయటికి వొచ్చి, '' అరుస్తున్నట్టే వుంటుంది మీకు; పిల్లాడు ఎక్కడికి పోయినట్టు? మీ కేమీ పట్టదు. ఒరే గోపాలూ' అంటూ మళ్లీ తారస్థాయిలో అందుకుంది.

మల్లికార్జునరావుకి భార్య అరుపుకి కారణం కొద్దిగా బోధపడింది. 'అబ్బ వూరుకోవే, వాళ్లింటో ఉన్నాడుగావును' అన్నాడు.

భార్యకి మరీ మండింది. 'అ! అట్లా వూరుకుంటే, సరిపోతుంది! మరీ ఇదయిపోతుందమ్మా! మనకైనా, సిగ్గుండాలి...' అంటో, పక్కభాగంలోకి విసురుగా పోయి, వరండాలోనుంచి, 'రారా! నీ దుంప తెగ, నీళ్లూ నిప్పులూ లేకుండా, పొద్దస్తమానం ఇక్కడే చచ్చావేరా.' అంటో కేకపెట్టేటప్పటికి, ఆరేళ్లగోపాలును ఎత్తుకుని ఆ భాగంలో ఉంటున్న సావిత్రమ్మ, బయటకొచ్చి, 'బిస్కట్లు తింటూ కూర్చున్నాడమ్మా' అని, సరస్వతి రౌద్రాకారపు వైఖరికి జంకి, మెదలకుండా, కుర్రాణ్ణి కిందికి దింపింది. కుర్రాడు భయపడుతూ, భయపడుతూ తల్లిదగ్గరకి వొచ్చాడు. సరస్వతి మూతివిరిచి కుర్రాణ్ణి బరబర లాక్కెడుతో, "మందే పెడుతున్నారో' మాకే పెడుతున్నారో క్షణం ఇంట్లో వుండడమ్మా.' అని పెద్దగా అంటూ ' ఇక అటూ పో చెబుతా వెధవా...' అని కుర్రాణ్ణి మందలించి తన మాతృత్వపు హక్కుల్ని ఖాయపరుచుకుంది.

మల్లికార్జునరావుకి ఏదో పత్రికకార్యాలయంలో మేనేజరుపని. రెండొందల పైచిలుకు జీతం. జీవితం సాఫీగానూ, కులాసాగానూ గడుస్తోంది. అతను ఒక పెద్ద ఇంటో ఒక భాగంలో కాపురం వున్నాడు. ఆ యింట్లోనే చిన్న భాగంలో సుందరం అనే ఆయన వుంటున్నాడు, భార్యా సమేతంగా. ఆయన ఏదో కాఫీ హోటల్లో పొయ్యి దగ్గిర పనిచేస్తున్నాడు. ఏభైయ్యో అరవయ్యో తెచ్చుకుని కాలం గడుపుకుంటున్నాడు ఆయన. చాలా మంచివాడు. ఆయన భార్యా అంతే. మల్లికార్జున రావు కొడుకు గోపాలు, ముచ్చటగా వుండడం వల్లనూ, పిల్లలంటే వస్తుతః సుందరంగారికి, ఆయన భార్యకి చాలా ఇష్టంగనుకనూ, గోపాల్ని ఎప్పుడూ తమ ఇంటోకి తీసుకెళ్ళి ఆడిస్తూ, ముచ్చటపడేవారు ఆదంపతులు. మొట్టమొదట ఈ విషయమై సరస్వతి ఏమీ బాధపడలేదుగాని - రాను రాను కుర్రాడు మరీ, వాళ్ళింట్లోనే

ఉండటం, పిన్నీ, పిన్నీ అంటో సావిత్రమ్మని వొదలకపోవటం, సరస్వతికి నచ్చలేదు. తన మాతృత్వానికి భంగం వస్తుందనో, కుర్రాడు వాళ్ళకి, ఆ డబ్బులేని, కాఫీహోటల్‌వాళ్ళకి అంతగా మాలిమి ఐపోవడమా అనే జెలసీ, మమకారంవల్లనో, సరస్వతి కుర్రాణ్ణి కోప్పడసాగింది.

పెద్దలకి ఉన్న మత్సరాలు కుర్రాళ్ళకి ఉంటాయా? సందుదొరికినప్పుడల్లా గోపాలు సావిత్రమ్మ దగ్గిరకి పరిగెడుతూనే ఉండేవాడు. 'పో నాయనా?' అని ఆమె అయినా ఎలా అంటుంది? ఏవో తింటానికి పెట్టి కుర్రాణ్ణి లాలించేది. పిల్లలులేని తల్లి, అందులోనూ నలుగుర్ని అర్థాయుషుగా పోగొట్టుకున్న తల్లి, పిల్లాడ్ని ఎలా పొమ్మంటుంది?

' ఆయనతోటి ఖచ్చితంగా చెప్పండి. లేదా, ఈ కొంపేనా మార్చండి, లేకపోతే నేను పిల్లాణ్ణి తీసుకుని మా వాళ్లింటికేనా పోతాను'' అని మల్లికార్జున రావుతోటి తగూకి దిగింది.

'వాళ్లేం జేసారని, ఆయనతోటి చెప్పను? ఇంత వెర్రిభ్రమ పడతావేమే? పిల్లలు లేని వాళ్ల గనుక...'

'చాల్లేండి చెప్పొచ్చారు గాని, కుర్రాడెందుకైనా పనికొస్తాడా, ఆ సంప్రదాయం అబ్బితే? చదువా సంధ్యా? కప్పులు కడిగేవాళ్ళతో సాపత్యమండీ మనకి?....'

'ఛీ... నోరుముయ్యి, వాళ్లు వినగలరు. మరీ రెచ్చిపోతున్నావుగా...' అన్నాడు భర్త. భార్య బిక్కమొఖం వేసి, ఏడుపుకు దిగింది. మల్లికార్జున రావు విసిగి, బయటికి బయల్దేరాడు. రోడ్డు మీదే సుందరంగారు ఎదురుపడ్డాడు. ఆయన చేతిలో సెల్యులాయిడ్ బొమ్మ ఒకటి వుంది. మల్లికార్జునరావు అతనితో ఏదో మాట్లాడాలనుకున్నాడు. కాని ఏమీ మాట్లాడలేదు.

మల్లికార్జునరావు సాయంత్రం ఇంటికొచ్చి నప్పుడు, సుందరం ఇల్లు ఖాళీ చేసి వెళ్తున్నాడు. మల్లికార్జునరావుకి ఇది బొత్తిగా అర్థం కాలేదు. ఇంటోకివెళ్ళేడు, వరండాలో దృశ్యం అతని హృదయాన్ని కలిచివేసింది. నిన్న సుందరంగారు కొనుక్కొచ్చిన బొమ్మ ముక్కలు ముక్కలై పడివుంది. కుర్రాడు ఏడుస్తోనుంచున్నాడు సరస్వతి దగ్గర. సావిత్రమ్మ గోపాల్ని దీనంగా చూస్తూ, సామాన్లు భర్తకు అందిస్తోంది. మల్లికార్జునరావు గబగబ లోపలకి పోయి, 'సరస్వతీ' అని కేకేశాడు. సరస్వతి కుర్రాణ్ణి లాక్కొని లోపలికి వొచ్చింది. మల్లికార్జునరావు కోపంతో మండిపోతూ ' ఏమిటిది?' అని మాత్రం అడిగాడు.

సరస్వతి మూతి విరుచుకుంటూ 'నాకేం తెలుసునండీ' అనుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది.

పదిహేను రోజుల తర్వాత ఓ రోజున మల్లికార్జునరావుకి ఆఫీసుకి ఫోన్‌కాల్ వచ్చింది. ఏమిటోనని అలక్ష్యంగా కనుక్కున్నాడు. 'మీ ఇల్లు నిప్పంటుకున్నది, త్వరగా రండి' అని పొరుగువారెవరో చెప్పారు. అతడు చాలా తొందరగా జట్కామీద.

ఇల్లు అంటుకుని నిప్పు నాలుకలుసాచి మండుతోంది. సరస్వతి, ఘోరంగా ఏడుస్తూ నిలబడి వుంది వాకిట్లో; ఆవిడకి సగం స్పృహ లేదు. బయట జనం ఆదుర్దాపడుతున్నారు, అబ్బాయి...

అబ్బాయి ... అబ్బాయి లోపలేవున్నాడు' వాపోతోంది సరస్వతి. బయటిగడపగూడా అంటుకుంది. మల్లికార్జునరావు బండి దిగేప్పటికి ఫైరు ఇంజన్లు వొచ్చాయి.

మల్లికార్జునరావు, సరస్వతిని పట్టుకుని ఒక్క ఊపు ఊపి, అబ్బాయి ఏడీ?... అబ్బాయి....' అని అడిగితే, సరస్వతి పిచ్చిగా, మండుతున్న ఇంటికేసి చెయ్యి చూపించి, కెవ్వున కేకేసి కిందపడిపోయింది. ఇంతలో గుంపులోంచి ఎవరో గబుక్కున మండుతున్న ఇంట్లోకి జొరబడ్డాడు. గుంపు 'వొద్దు వొద్దు' అని కేకేస్తున్నా వినిపించుకోలేదు ఆవ్యక్తి. ఏడు ఎనిమిది నిమిషాలకల్లా, పిల్లాణ్ణి భుజం మీద పడుకోపెట్టుకుని అతడే బైటికి చాలా గాయాలతో వొచ్చాడు. కుర్రాణ్ణి మల్లికార్జునరావు అందుకున్నాడు ఆ వ్యక్తి కింద పడిపోయాడు. అతని గుడ్డలు కాలి, వొళ్ళంతా బొబ్బలెక్కినాయి. ఫైర్ ఇంజన్లు, ఇతర ఇళ్ళు తగలబడకుండా రక్షించగలిగాయంతే.

★★★

సరస్వతిని వెంటబెట్టుకుని మల్లికార్జునరావు జనరల్ ఆస్పత్రికి వచ్చాడు. ఈలోగా ఆమె ఏమడిగినా ఏమీ జవాబు చెప్పలేదు. కుర్రాడు జరిగినదాన్ని ఏదో రకంగా వూహించుకుంటో తండ్రిని ప్రశ్నలతో చంపుతున్నాడు.

' ఎవరండీ ఆయన, అంత ప్రాణానికీ తెగించింది?' అని అడిగింది సరస్వతి ఆస్పత్రిలోకి ప్రవేశిస్తూ.

భర్త ఆమె చెయ్యి పుచ్చుకుని బరబర వార్డులోకి ఈడ్చుకెళ్ళి, వొళ్ళంతా కట్టు కట్టుకుని బాధతో నరక యాతన పడుతున్న సుందరంగారి పాదాల దగ్గిర నిలబెట్టి, 'చూడు.... నువ్వు, నీ మాతృత్వం, నీచుట్టూ నుల్చున్న గుంపు - నేను, ఎవ్వరమూ, రక్షించలేక పోయినాం. ఈ మహానుభావుడు...' ఆపైన అతను ఆవేశంతో మాట్లాడలేదు.

సరస్వతి కన్నీళ్ళతో, సుందరంగారి పాదాలు తడిసినాయి. కుర్రాడు 'బాబాయి.... బాబాయి' అంటూ ఏడవసాగాడు. సుందరం కలలో మేల్కొన్నట్టు, హీనస్వరంతో ' ఏడవకు బాబూ' అన్నాడు.

మల్లిఖార్జునరావు కృతజ్ఞతావేశంతో, అతనికి నమస్కరిస్తూ, 'సరస్వతీ' వృత్తికీ, సంస్కారానికీ, ప్రేమకి ఎన్నడూ సంబంధం లేదని, బోధపడిందా ఇప్పుడైనా?' అంటుంటే, సరస్వతి కొడుకు చెయ్యి సుందరంగారి చేతికి అందించి, 'నేను వీణ్ణి కన్నమాట నిజమేగాని పునర్జన్మ ఇచ్చింది మీరేనండి. ఇక వీడు మీ కొడుకే...' అంటూ ఆవేశంతో, ఏడవ సాగింది.

*(జనవరి 9, 1950, తెలుగు స్వతంత్ర)*